# నిరీక్షణ

ఎం. వి. వి
సత్యనారాయణ




రైల్వేస్టేషన్‌కి వచ్చింది లగాయితూ ముసలాయననే గమనిస్తున్నాడు గిరిధర్. ముసలాయన రైల్వే ప్లాట్‌ఫాం మీద క్షణం తీరుబడి లేకుండా పచార్లు చేస్తున్నాడు. కుర్చీలవైపు వస్తాడు. ప్లాట్‌ఫాం అంచుకు వెళ్తాడు. వంగి దూరంగా చూస్తాడు. తలతిప్పి రెండోవైపూ కనిపించినంత దూరం చూస్తాడు. తల పంకిస్తాడు. నిట్టూర్పుతాడు. వెనక్కి తిరుగుతాడు. అంతలోనే ఏదో గుర్తొచ్చినట్టు ఎంక్వయిరీ బూత్ సమీపిస్తాడు. అంతకుముందే బూత్ వద్ద గుమిగూడి వున్న జనాన్ని చీల్చుకుంటూ గుమాస్తాను సమీపిస్తాడు.

ఏవేవో రెండు ప్రశ్నలు వేస్తాడు. గుమాస్తా ఇచ్చిన సమాధానాలతో అంతగా సంతృప్తిపడనట్టో, ఏకీభవించనట్టో చూస్తాడు. తిరిగి ప్లాట్‌ఫాం అంచుకు చేరుకుని చూపు వెళ్లినంతమేరా చూస్తాడు.

తలపంకించడం నిట్టూర్చడం అంతా .తిరిగి మామూలే!

గిరిధర్‌కి ఆ ముసలాయన ప్రవర్తన చాలా విచిత్రంగా తోచింది. ప్లాట్‌ఫాం నిండా వేల యీనినట్టు ప్రయాణీకులో, వాళ్ల బంధుమిత్రులో వున్నారు. ముసలాయన మాత్రం ప్రయాణీకుల్ని పట్టించుకోవడంలేదు.

తన ధోరణే తనదిగా ప్రవర్తిస్తున్నాడు.

లౌడ్‌స్పీకర్‌లో టక్‌మంటూ చప్పుడయ్యింది.

గిరిధర్ ఇతర ప్రయాణీకుల మాదిరిగానే ప్రకటనవైపు చెవులొరగా పెట్టాడు.

"దయచేసి వినండి!. రాజమండ్రి నుంచి విశాఖపట్నం వచ్చు డి.ఎం.యు. మరి కొద్దిసేపట్లో మూడోనెంబర్ ప్లాట్‌ఫాంమీదికి వచ్చును!"

తర్వాత హిందీలో, ఆంగ్లంలో ప్రకటనాపాండిత్యం చవిచూశాడు గిరిధర్. ఆ దరిమిలా నిరాకుపడ్డాడు. ఇంతకుముందే ఒకటోనెంబర్ ప్లాట్‌ఫాం మీదికి సదరు పాసింజర్ రైలు వస్తోన్నట్టు ప్రకటించిన లలనామణి ఎలాంటి ముక్తాయింపులూ లేకుండా నెంబర్ మార్చేసి, ఇదే సాంప్రదాయం రైల్వేశాఖవారి సహజలక్షణంగా నిర్ధారించింది.

తండ్రి ఇదే రైలుకి వస్తోన్నట్టు రాశారు. ఆయన్ని తోడ్కొనిపోవడానికి వచ్చాడు గిరిధర్. పల్లెటూరు నుంచి తండ్రి రావాలంటే ఈ రైలే అనుకూలం.

ఆలోచనలతో గిరిధర్ వంతెన దాటి 'మూడు' మీద దిగబడ్డాడు. మూడుమీద అట్టే రద్దీ లేదు.

## మెరుపులు - మరకలు

అద్దం ముక్కలయ్యింది
ప్రతి శకలం అంకితం నీకే
అద్దం- అది నాజీవితం

2.

అందంగా నాకు నచ్చావు
హృదయాన్ని దహిస్తున్నావు
ఏదో ఒక నెపంతో
నీ పుస్తకాలన్నింటిలో
నాపేరును వెదుక్కుంటున్నా

3.

నా ఆశలన్నీ పణం పెట్టి
నీ గృహ లక్ష్మినయ్యాను
నా చివరి ఉత్తరం
అమ్మా నాన్నలకి చేరింతో లేదో
వాళ్లని మోసగించింది నవ్వు కాదు
ఈ సమాజమే!

4

ఈ వానజల్లు వేధిస్తున్నది
తనువును తడిపేస్తున్నది
కాని
మదిని కరిగిస్తున్నది

చిల్లర భవానీ దేవి

---

రైల్లో వచ్చే బంధువులకోసం వచ్చినవాళ్ళు కాబోలు వున్నారు.

తనని ఎవరో రాచుకుంటూ వెళ్లడంతో చటుక్కున వెనక్కితిరిగి చూశాడు గిరిధర్. ముసలాయన! అసలు గిరిధర్ అనే ప్రాణి ఒకడు తనదారికి అడ్డుగా వున్నట్టు కూడా ఆయన గుర్తించినట్టులేదు.

జాలిపడ్డాడు గిరిధర్.

మానసికంగా ఆయనకి ఆరోగ్యం తగ్గినట్టుంది.

ఈ ప్లాట్‌ఫాం మీద ... కూడా ముసలాయన తన కార్యక్రమాలు యథావిధిగా కొనసాగించుతూ వచ్చాడు.

చిట్టచివరికి డి.ఎం.యు. తక్కుతూ తారుతూ వచ్చింది. ప్లాట్‌ఫాం మీదకు దిగుతూన్న ప్రయాణీకుల రద్దీ పెరిగింది. తండ్రిని వెతుక్కునే ప్రయత్నంలో పడ్డాడు గిరిధర్. బోగీలన్నీ కలియ తిరిగాడు తప్పితే తండ్రి వచ్చిన జాడే లేదు.

తండ్రి వస్తోన్నట్టు ఖచ్చితంగా రాశాడు. రాలేదు. ఎందువల్ల రాలేదు? చివరి సమయంలో ప్రయాణం వాయిదాపడిందా? రైలు అందలేదా? ప్లాట్‌ఫాం లేని స్టేషన్‌కావడంవల్ల రైలు ఎక్కలేకపోయాడా?

సవాలక్ష సందేహాలు!

రద్దీ తగ్గాక వంతెన మెట్లవైపు కదిలాడు గిరిధర్.

మొదటిమెట్టు దగ్గరే కాసుకుని వున్నాడు ముసలాయన.

తాను అతడ్ని గమనిస్తోన్నట్టుగానే అతడూ తనని గమనిస్తాడని వూహించుకోలేకపోయాడు. గిరిధర్.

"అంతే ... కాలపరిస్థితి అంతే నాయనా! ఎవరికోసం చూస్తామో వాళ్లే రారు!" అన్నాడు ముసలాయన తలత్రిప్పుతూ.

తనని ఉద్దేశించే ఆయన మాట్లాడాడని గ్రహించాడు గిరిధర్. ఏమీ జవాబివ్వకపోతే అది సభ్యతగా వుండదనిపించింది.

తన తండ్రి వయస్సు పెద్దమనిషి!

"మా నాన్నగారు వస్తానని రాసి రాలేకపోయారండి" అన్నాడు గిరిధర్.

"నాకు తెలుసు నాయనా! వస్తానని వూరించి చెబుతారు. రారు. మా అబ్బాయీ అంతే! తానూ, కోడలూ, పిల్లలూ కలిసి వస్తోన్నట్టుగా రాశాడు. రాలేదు!"

ఇద్దరూ మెట్లెక్కి ఆకాశంలో వంతెనమీద కదులుతున్నారు.

"ఎక్కడ్నుంచి రావాలి మీ అబ్బాయీ, కుటుంబమూ...?"

ఆయన గిరిధర్‌ను ఎగాదిగా చూశాడు. ఆ చూపులో ఒక ప్రశ్నార్థకమో పిచ్చితనమో కదలాడింది. దిగవలసిన మొదటి మెట్టుదగ్గరే ఆగిపోయాడు ముసలాయన.

చిన్నగా విషాదంగా నవ్వి "ఎక్కడ్నుంచేనా! పక్కనే వున్న మద్రాస్‌నించి. పట్టుమని పన్నెండు గంటల ప్రయాణం. మూడేళ్ళనించీ రావడంలేదు" అన్నాడు ముసలాయన.

నెత్తిమీద పిడుగుపడినట్టు ఉలిక్కిపడ్డాడు గిరిధర్.

"మద్రాస్‌నించా! ఈ బండి రాజమండ్రి నుంచే వస్తుంది!"

"అవును. మావాడు మధ్యలో ఎక్కడో ఆగి తిరిగి బయల్దేరవచ్చుకదా!"

రైల్వేస్టేషన్లోంచి బైటికి వచ్చేటప్పటికల్లా ముసలాయన తన భారతం అంతా అతడికి వినిపించగలిగాడు.

"బోర్ కొట్టానా నాయనా?" అన్నాడు చివరగా.

మర్యాదకోసం తల అడ్డంగా తిప్పాడు గిరిధర్.

అయిదేళ్ళ క్రితం ముసలాయన కొడుకు రత్నం మద్రాసు వెళ్ళాడట. వర్తకంలో స్థిరపడ్డాక ఒక ఏడాది తర్వాత భార్యాబిడ్డల్ని తీసుకువెళ్ళిపోయాడట. అప్పట్నించీ ఇప్పటివరకూ వాళ్లెవరూ ముసలాయనకి కనిపించక పాపం ఆయన మానసికంగా గిలగిలలాడుతున్నాడు. ముసలావిడ కూడా పోయిందయ్యో!

మనవడిమీదా మనవరాలిమీద ఆయనకి వల్లమాలిన ప్రేమానురాగాలున్నట్టు గిరిధర్ అర్థం చేసుకున్నాడు.

ముసలాయన గురించి అంతవరకూ వున్న అపోహకి పశ్చాత్తాపపడ్డాడు. సరిగ్గా అదే పశ్చాత్తాపదశలో—

"ఒకసారి మా ఇంటికి రండి! కాస్త టీ తాగి వెళ్దురుగాని—" అనవలసి వచ్చింది.

ముసలాయన మొహంలో అపరిమితమైన ఆనందం పెల్లుబికింది. గిరిధర్‌ని చేతులు పట్టుకుని కావలించుకున్నంత పనిచేసి అతడ్ని

---

### ఉద్యోగం

ప్రముఖ సైన్టిస్ట్ బెంజమన్ ఫ్రాంక్లిన్ తన చిన్నతనంలో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించాడు. అప్పట్లో ఆయనకు తగిన చదువు కూడా లేదు. ఆకలి బాధతో సతమతమవుతున్న బెంజమన్‌కు ఒక స్కూల్లో ఉద్యోగం ఖాళీగా ఉన్నట్టు తెలిసి ఆ స్కూలుకు వెళ్లాడు.

మేనేజర్ ఫ్రాంక్లిన్‌తో "నువ్వేమైనా చదువులు చదివావా?" అన్నాడు

"లేదు"

"నీకు ఉపాధ్యాయునిగా అనుభవం వుందా?"

"లేదు"

"అయితే ఈ ఉద్యోగానికి కావలసిన ఏ అర్హతలు నీకున్నాయి?" అన్నాడు మేనేజర్

"ప్రస్తుతం నాకు రెండు అర్హతలు వున్నాయి. మొదటిది నేను పదిహేడు మంది పిల్లలు గల కుటుంబంలో పథ్నాల్గవ వాడిగా పుట్టాను! రెండవది–నేను ప్రతీరోజూ పూట గడవక బాధపడిపోతున్నాను" అన్నాడు.

అది విని మేనేజర్ ఎంతో బాధపడి బెంజమన్‌కు ఉద్యోగం ఇచ్చాడు!

కొడిమెల శ్రీరామమూర్తి

---

### ప్రముఖుల ఛలోక్తులు!

బెర్నార్డ్‌షాను ఒక మిత్రుడు కలిసి "షా గారూ! మనకు మధ్య వయస్సు వచ్చినట్లుగా ఎలా తెలుసుకోగలం?" అని అడిగాడు.

అందుకు ఆ రచయిత నవ్వుతూ "మనం ఒకరోజున టెన్నిస్ ఆడి మూడు రోజుల వరకూ అలసట చెందినప్పుడు, మన చెవుల మీద మొలుచుకొచ్చిన వెంట్రుకలు మన తల వెంట్రుకలకన్నా పొడవైనప్పుడు, ప్రేమ కలాపాల సమయంలో కాకుండా మనం డబ్బు ఖర్చవుతుందని భయపడి గదిలో లైటు తీసినప్పుడు, మనం మంచం మీద ఆ చివర నుంచి ఈ చివర వరకు, బాత్‌రూము దగ్గరగా పడుకుంటున్నప్పుడు, మేడ ఎక్కుతున్నప్పుడు మెట్టు మెట్టుకూ ఇన్ని మెట్లు కట్టడం, ఇంత ఎత్తున మేడ కట్టడం పొరబాటైపోయింది అని మనం అనుకున్నప్పుడు మధ్యవయస్సు వచ్చినట్లుగా మనం భావించాలి" అన్నారు.

కొడిమెల

ఉక్కిరిబిక్కిరి చేశాడు.

గిరిధర్ మొహమంతా అతని నోటి తుంపర్లతో తడిసిపోయింది.

వీదరించుకోలేదు గిరిధర్.

మనుషులకోసం, ఆదరణా ఆప్యాయతలకోసం మొహంవాచిపోయి వున్నాడు ముసలాయన.

తన ఇంట్లో భార్యచేత టిఫిన్ చేయించి ప్రత్యేకంగా ఆతిథ్యం ఇచ్చాడు గిరిధర్. టీని గడగడ లాడుతూ తాగి గిరిధర్ దంపతులను మనసారా ఆశీర్వదించాడు.

"పిల్లలు కలగలేదని ఇప్పడప్పడే ఆరాటం పెంచు కోవద్దు. ఇదిగో, నేనెంత ఆరాటపడ్డానో అంతకు అంతా అనుభవిస్తున్నాను."

వీధి చివరివరకూ ముసలాయన్ని సాగనంపి ఇంటికి తిరిగివచ్చాడు గిరిధర్.

వీధి వాకిట్లోంచి వెళ్తుండగా ఎదురింటాయన పలకరించి గిరిధర్‌ని నిలబెట్టేశాడు.

"ఎవరో వచ్చినట్టున్నారు ఇంటికి?" అడిగాడాయన.

"రైల్వేస్టేషన్‌కి వెళ్తే అక్కడ పరిచయమయ్యారాయన!" జవాబిచ్చాడు గిరిధర్.

ఎదురింటాయన తలూపి. "మీ నాన్నగారు రాలేదన్నమాట!" అన్నాడు.

గిరిధర్ నిట్టూర్చాడు.

ఇంట్లోకి వెళ్ళిన తర్వాత అడిగింది భార్య.

"ఎదురింటి రత్నంగారేమిటో అడుగుతున్నారు. అప్పా?"

"కాదు. ఇప్పడొచ్చిన ముసలాయన గురించి–"

"ఏమిటాలోచిస్తున్నారు?" అడిగింది భార్య.

"ఎదురింటాయన పేరు రత్నం కదూ!"

"అవును!"

"ఉద్యోగం కాదు. వ్యాపారం కదా చేస్తాడు?"

"ఊ!"

"అతడికి ఒక అబ్బాయి, అమ్మాయి!"

"అవును!"

"పోయిన సంవత్సరం కదూ మద్రాస్ నించి వచ్చేశారు?"

"అవును. ఆ ఇంటి తాళంచెవులు మనదగ్గరే కదూ వుండేవి!"

"ఈ రత్నం గురించే కాబోలు వెతుక్కుంటున్నాడు ఆ ముసలాయన!" బైటికి వేగంగా కదలబోయాడు గిరిధర్.

భార్య చటుక్కున అతడి చెయ్యి పట్టుకుని ఆపింది.

గిరిధర్ ఆగిపోయాడు. ఆలోచనలో పడ్డాడు.

"రత్నం ఈ ముసలాయన కొడుకే అయివుంటే ఎందువల్ల తండ్రిని మోసం చేస్తున్నాడు?"

"ఎందువల్లనైతే మనకేం! అలా మోసం చేసే కొడుకు ఆయనకి లేకపోవడమే మంచిది!" అంది భార్య.

"మరి ఆయన ... రోజూ ... రైలుకోసం ..."

ఆమె నవ్వి "అసలు మనిషి వచ్చే కంటే నిరీక్షణలోనే ఎంతో తీపి వుంది కదా!" అంది.

● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ●




## సంజె పరిమళం

జంట కోయిల స్వరమేళా
ఉదయానికి ఒకమెలకువ నేర్పింది
కొమ్మనుండి కొమ్మకు
హృదయం నుండి హృదయానికి
ఒదిగిన ప్రశాంతత
రాగసూరీణ్ణి వేకువలోకి వొంపింది
చెట్టు పాడుతోంది పూల కనులతో పసిపాపై
ఏ అదృశ్య చిత్రకారుడో
రాత్రికీ కళాదృష్టి నిచ్చింది
పాపం, చీకటి , రాత్రంతా జాగారం చేసి
ఒక విచిత్రమై కూచుంది
వెన్నెల కెవరు నేర్పారో ఈ కవిత్వ భాష
తెర తొలగి
మసక బారిన దృశ్యాలన్నీ స్పష్టమౌతూ
సంజీవని మోసుకెళ్తున్నట్టు
మేఘాల అలల నిశ్శబ్ద ప్రవాహం
నారింజ యవ్వనం
అప్పడే తలుపు తట్టిన నగ్నసౌందర్యంలా
సంధ్య ఆవిష్కారమే ఓ వింత ఆహ్వానం
ఒక రోజుకు ప్రాణం పోసిన తేజస్సు
భూమ్మీద ఒక మహా ఫౌంటన్
బ్రతుకు నదిని కుదిపిన జీవన సంగీతం

శిఖా ఆకాష్

## ఖద్దరు దుస్తులు!

ప్రముఖ కేరళ కవి చంగుమే పుజాకృష్ణ పిళ్లై పూనెలోని బ్రిటీష్ ఆర్మీ ఆఫీసులో ఎకౌంటెంట్‌గా పనిచేసేవాడు. అది దేశంలో స్వాతంత్ర్య సంగ్రామం జరుగుతున్న రోజులు. దేశభక్తి మెండుగా గలవాడు కృష్ణ పిళ్లై. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడానికి ఉవ్విళ్లూరుతున్నవాడు.

ఒకరోజున ఆయన ఖద్దరు దుస్తులను ధరించి ఆఫీసుకు హాజరయ్యాడు. అది చూసిన ఆఫీసరు అడిగాడు–



"ఈ ఆఫీసులో మిలటరీ దుస్తులనే ధరించి పని చెయ్యాలని నీకు తెలునుగదా? అయినా నువ్వు ఖద్దరు దుస్తులను ధరించి వచ్చావు ఎందువలన?"

"నాకు ఉద్యోగం ఇచ్చింది బ్రిటీష్ వారే అయినా, నేను మాత్రం భారతీయుడ్నే! ఇది నా దేశంలో స్వరాజ్య సమరం జరుగుతున్న రోజులు. అందువలన ఓ భారతీయునిగా నేను ఖద్దరు దుస్తుల్నే ధరిస్తాను" అని ఖచ్చితంగా చెప్పాడు కృష్ణపిళ్లై. ఆ మర్నాడు ఖద్దరు దుస్తులను ధరించి ఆఫీసుకు వచ్చిన అతడ్ని ఒక పెద్ద ఆఫీసరు పిలిచాడు.

"ఈ బట్టలను వేసుకుని నువ్వు ఆఫీసుకు రావడంలో నీ ఉద్దేశ్యం ఏమిటి?"

"చూడండీ! నేను భారతీయుడ్ని! అందువలన ఈ దుస్తుల్నే ధరిస్తాను! ఇది మీ రూల్స్‌కు వ్యతిరేకమే అయితే నేనీ ఉద్యోగం చెయ్యను! ఇప్పడే రాజీనామా ఇస్తున్నాను!" అన్నాడు గంభీరంగా

పిళ్లై ఉద్యోగానికి రాజీనామా చేసి తన గ్రామానికి తిరిగి వెళ్లి హాయిగా అనేక కవితలు వ్రాసుకున్నాడు!

—కొడిమెల శ్రీరామమూర్తి